నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
12 | నిజామాబాద్ మంగళవారం 4 మార్చి 2025 | ADILABAD NIRMAL

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

సీసీఐ విషయంలో ఎంపీ, ఎమ్మెల్యేల వైఖరి స్పష్టం చేయాలి

- సిమెంటు పరిశ్రమను ప్రారంభిస్తామని బీజేపీ మోసం చేసింది..
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, మార్చి 3(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ(సీసీఐ) విషయంలో బీజేపీ ఎంపీ నగేశ్, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు తమ వైఖరిని స్పష్టం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను అమ్మకం దిశగా చర్యలు చేపట్టిందని.. ఇందులో భాగంగా పరిశ్రమలోని యంత్రాలు, ఇతర సామగ్రిని విక్రయించడానికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు సీసీఐ అమ్మకాన్ని అడ్డుకుంటారా? లేదా? కేంద్రానికి వంత పాడుతారనే విషయంలో స్పష్టత ఇవ్వాలని సూచించారు. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన హన్స్‌రాజ్ గంగారాం సీసీఐని సందర్శించి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన కేంద్ర మంత్రులు కూడా సీసీఐని ప్రారంభిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు సీసీఐని కేంద్రం అమ్మకానికి పెట్టి జిల్లాకు అన్యాయం చేస్తుంటే బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

బీజేపీ వైఖరికి నిరసనగా ఆందోళనలు

కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న జిల్లాకు సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళనలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఆదిలాబాద్, ఆర్మూర్ రైల్వేలైన్, సిమెంటు పరిశ్రమ, ఎయిర్ పోర్టు, ఆదిలాబాద్ గడ్చాందూరి రైల్వేలైన్ విషయంలో కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. పదకొండేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ జిల్లా అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా మామునూర్‌కు విమానాశ్రయం మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును ఎందుకు మరిచిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో సీసీఐ విషయంలో పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలిసినా ఫలితం లేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజ్ఞగిరి నారాయణ, సాజిదుద్దీన్, ప్రభాకర్, అడప తిరుపతి, బట్టు సతీశ్, కుమ్ర రాజు, వినోద్, సాయి, ఆలం పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న ఏపీవో వసంత్‌రావు

ఉట్నూర్, మార్చి 3 : గిరిజనుల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంత్‌రావు అన్నారు. సోమవారం స్థానిక సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల అభివృద్ధితోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు పలు పథకాలు, రెవెన్యూ, ఫారెస్ట్ సమస్యలు, ఇండ్లు కావాలని అర్జీలు పెట్టుకున్నారన్నారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేశామని తెలిపారు. ఈ దర్బార్‌లో ఏపీవో వసంత్‌రావు, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి మనోహర్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

సోన్ మండలంలోని వెంగ్వాపేట్‌లో నీరు లేక ఎండిన వరిపైరు

చివరికి కన్నీరు

- స్వర్ణ వాగు పరిధిలోని రైతులు ఆందోళన
- నీటిని పెద్ద మొత్తంలో విడుదల చేసి ఆదుకోవాలని వేడుకోలు

ఎడారిని తలపిస్తున్న స్వర్ణ వాగు

సోన్, మార్చి 3 : స్వర్ణ ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాలువలతోపాటు జౌలినాలా కూడా ఉంటుంది. నీరు అధికం అయినప్పుడు జౌలినాలా ద్వారా నీటిని దిగువనకు వదులుతారు. దీని పరిధిలో నిర్మల్, దిలావర్‌పూర్ మండలాల్లోని వెంగ్వాపేట్, కాల్వ, కాల్వ తాండ, తల్వేద, చిట్యాల్ గ్రామ రైతులు ఈ యాసంగిలో వరిని సాగు చేశారు. దాదాపు 400 మంది రైతులు 1600 ఎకరాలు సాగు చేస్తున్నారు. స్వర్ణ ఎడారిని తలపిస్తుండడంతో నీరందక దిగుబడి తగ్గే అవకాశం ఉంది. డిసెంబర్‌లో నాట్లు వేయగా.. మరో నెల రోజుల్లో పూత, ఈనే దశకు రానుండడంతో నీరు తప్పనిసరిగా అందించాల్సి ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును కలిసి రైతులు నీటిని వదిలించాలని విన్నవించారు. వీరు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటిని విడిపించినా రెండు, మూడు రోజులైనా నీటిధార చివరి వరకు రావడం లేదు. ఇప్పుడే నీరు రాకుంటే.. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో ఇంకా ఇబ్బంది అవుతుందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. పంటలు ఎండి దిగుబడి తగ్గితే నష్టాల పాలవుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగుతోపాటు మూగ జీవాల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. తాగుతామంటే నీరు కూడా లేని దుస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటిని అధిక మొత్తంలో జౌలినాలా ద్వారా విడుదల చేసి కాపాడాలని కోరుతున్నారు.

నీటిధార బంధైంది..

నాకున్న ఆరెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశా. ప్రస్తుతం పంట బాగున్నప్పటికీ వాగులో నీరు లేక.. ఉన్న మోటరును గుంత తవ్వి నీటిలో దించాల్సి వస్తున్నది. అయితే పైనుంచి నీటిధార రాకపోవడంతో పంట చేతికొస్తుందో లేదోనని భయంగా ఉంది. ఇప్పటికే ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించగా నీటిని విడుదల చేయించారు. ప్రస్తుతం వాగులో నీరు పూర్తిగా ఎండిపోయింది. పరిస్థితిని అర్థం చేసుకుని నాయకులు, అధికారులు నీటిని విడుదల చేస్తే తమ పంటకు ఢోకా ఉండదు.

- కొప్పుల రాజు, రైతు, వెంగ్వాపేట్.

రైతు భరోసా.. ఇదేమి గోస

డబ్బుల జమపై అన్నదాతల్లో అసంతృప్తి

- ఏ పద్ధతి ప్రకారం అమలు చేస్తున్నారో అంతుబట్టని వైనం
- ఎకరం ఉన్న రైతులకు కూడా జమకాని డబ్బులు
- నిర్మల్ జిల్లాలో 2,01,326 మంది రైతులు
- ఇప్పటి వరకు 1,10,038 మందికే 'భరోసా' వర్తింపు
- ఇంకా 91,288 మందికి తప్పని ఎదురుచూపులు

నిర్మల్, మార్చి 3(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం అయోమయం, గందరగోళంగా తయారైంది. ఇప్పటి వరకు ఎకరం, రెండెకరాలు, మూడెకరాల చొప్పున నిధులు జమ చేశామని ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. రైతుభరోసా డబ్బులను ఎకరాల వారీగా జమ చేశారా? లేక సర్వే నంబర్లవారీగా రైతుల ఖాతాల్లో వేశారా? అనే విషయం తెలియక గందరగోళం నెలకున్నది. కొన్ని చోట్ల ఒక ఎకరం భూమి ఉన్న రైతుకు ఆ భూమిలో సగానికి కూడా రైతుభరోసా జమ కాలేదు. మరికొందరికి రెండెకరాల భూమి ఉంటే ఒక ఎకరానికే డబ్బులు జమ అయ్యాయి. మూడెకరాల లోపు ఉన్నప్పటికీ చాలా మందికి ఎకరం, అర ఎకరానికి మాత్రమే డబ్బులు వచ్చాయి. మరి కొందరికి అసలే రాలేదు. దీంతో రైతుభరోసా కాస్త కోతల భరోసాగా మారిందని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికే చాలామందికి రుణమాఫీ కాలేదు. బోనస్ కూడా అందలేదు. యాసంగి పంటలు వేసి దాదాపు రెండు నెలలు అవుతుండడంతో పెట్టుబడికి చేసిన అప్పులకు వడ్డీలు కట్టాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతుభరోసా సాయాన్ని అందిస్తే చేసిన అప్పులు కట్టేస్తామని ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే ఎదురవుతున్నది. జనవరి 27న ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడి రైతులకు మాత్రమే రైతుభరోసాను అందించింది. మిగతా వారికి ఈనెల 31వరకు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రైతుభరోసా అందజేస్తామని చెబుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేకుండా పోయింది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల రైతులకు ఎన్ని ఎకరాలు ఉన్నా రైతుభరోసా సాయం అందింది. తమకు మాత్రం రెండెకరాలు న్నా పెట్టుబడి సాయం ఎందుకు రావడం లేదంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి రైతుకు రంధనుగా సాయం అందిందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

నిర్మల్ జిల్లాలో రూ.180.65 కోట్లు పెండింగ్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు విడుతల్లో మూడెకరాల లోపు ఉన్న రైతులందరికీ రైతుభరోసా నిధులను జమ చేశామని చెబుతున్నప్పటికీ, ఇంకా చాలామంది రైతులకు డబ్బులు జమకాలేదు. రెండు, మూడు ఎకరాల భూములున్న రైతులు రైతుభరోసా డబ్బులు జమ అయ్యాయేమోనని బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాలను చూస్తే డబ్బులు ఇంకా రాలేదని అధికారులు చెబుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. నిర్మల్ జిల్లాలో 2,01,326 మంది రైతులు రైతుభరోసా పథకానికి అర్హులుగా ఉన్నారు. వీరికి యాసంగి సీజన్‌కు రూ. 277.04 కోట్ల డబ్బులను ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నది. అయితే ఇప్పటి వరకు మూడెకరాల లోపు ఉన్న 1,10,038 మంది రైతులకు రూ.96.39 కోట్లు జమ చేశారు. ఇంకా జిల్లాలోని 91,288 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.180.65 కోట్లు జమ కావాల్సి ఉన్నది. రెండు నెలలుగా మూడెకరాల రైతులకే ముప్పుతిప్పలు పెడుతున్న ప్రభుత్వం.. పదెకరాల వరకు ఉన్న వారికి పెట్టుబడి సాయం అందాలంటే ఇంకా ఎన్ని నెలలు పడుతుందోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడికి అప్పు తెచ్చినం..

ఉన్న రెండెకరాల పొలంలో వరి ఏసిన. ఇప్పటి దాక దుక్కులు, దమ్ము, నాట్లకు, మందులకు రూ.20 వేల దాక పెట్టుబడి ఖర్చులు అయినయ్. రైతుభరోసా పైసలు రాంగనే ఇస్త అని చెప్పి తెలిసిన కాడ బాకీ తెచ్చిన. రెండు నెలల సంది ఎదురుచూస్తున్న. రూపాయి రాలే. రైతుభరోసా పైసల కోసం రోజు బ్యాంకుల పొంటి తిరుగుడైతున్నది. నాకు 70 వేల లోన్ ఉంటే, రుణమాఫీ కూడా కాలేదు. ఎవుసం చేయాలంటేనే కండ్లకు నీళ్లు అస్తున్నయ్. కొందరికీ రుణమాఫీ చేసిన్రు, మూడెకరాలు ఉన్నోళ్లకు రైతుభరోసా పైసలు కూడా పడ్డయట. నాకు రెండెకరాలే ఉన్నది. మరి మేమేం పాపం చేసినం. మేము కూడా రైతులమే కదా. మాకెందుకు సాయం చేస్తలేరు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు గిట్ల లేకుండే. అందరిని సమానంగా చూసిండు. అస్తే అందరికీ ఒకేసారి అస్తుండే.

పి.లక్ష్మి, మహిళా రైతు, తర్లపాడు, ఖానాపూర్ మండలం.

తర్నంబి గ్రామంలో పెళ్లికూతురుకు ఆర్థిక సాయం చేస్తున్న గ్రామ ఆడబిడ్డలు

ఆడబిడ్డలూ.. హ్యాట్సాఫ్..

ఆడపడుచు పెండ్లికి ఆర్థిక సాయం

నేరడిగొండ, మార్చి 3 : అది మారుమూల గిరిజన గ్రామం. అక్కడి ఆడపడుచులు నిర్ణయం అద్భుతం. వారికి వచ్చిన ఆలోచన హ్యాట్సాఫ్. తర్నం-బి గిరిజన గ్రామంలో ఇటీవల జరిగిన పేదింటి ఆడపడుచు పెండ్లికి గ్రామంలో 62 కుటుంబాల ఆడపడుచులు ఆర్థికంగా అండగా నిలిచారు. ఈ సంవత్సరం నుంచి గ్రామంలో జరగబోయే పెళ్లిళ్లలో(అయిరీ) కట్న కానుకలతో ఆడపడుచుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుండడంతో నిషేధిస్తున్నట్లు ఆదివాసులు తీర్మానం చేశారు. సంప్రదాయమైన తంతు తప్ప అదనంగా ఖర్చులు చేయడం శాశ్వతంగా రద్దు చేయాలని నిర్ణయించారు. కట్న కానుకలు లేకపోవడంతో 62 కుటుంబాల ఆడపడుచులు వారికి తోచినంత పొదుపు చేసుకుని రూ.12,342లు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆ గిరిజన ఆడపడుచుల నిర్ణయాన్ని ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు.

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW

గంట ముందుగానే కేంద్రాలకు రావాలి

ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం..

- రేపటి నుంచే ప్రథమ.. ఈనెల 6 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు
- పరీక్షకు హాజరుకానున్న 13,133 మంది విద్యార్థులు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాం
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో డీఐఈవో పరశురాం

నిర్మల్ అర్బన్, మార్చి 3 : ''ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశాం. ఈ నెల 5వ తేదీ(బుధవారం) నుంచి రెగ్యూలర్, ఒకేషనల్ ప్రథమ.. 6వ తేదీ (గురువారం) నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమై 20వ తేదీతో ముగియనున్నాయి. ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాం..'' అని డీఐఈవో పరశురాం తెలిపారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

నమస్తేతో మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారి పరశురాం

నమస్తే తెలంగాణ : ఎన్ని సెంటర్స్? ఎంత మంది పరీక్ష రాస్తున్నారు?

డీఐఈవో : నిర్మల్ జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 13,133 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో రెగ్యులర్ విద్యార్థులు 6,571 మంది.. ద్వితీయ సంవత్సరంలో 6,562 మంది రాస్తున్నారు. వీరికి నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో 23 కేంద్రాలను ఏర్పాటు చేశాం. అలాగే రెండు సెల్ఫ్ సెంటర్లను ఏర్పాటు చేశాం.

నమస్తే : సమస్యాత్మక కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయి?

డీఐఈవో : భైంసా కేంద్రాన్ని సమస్యాత్మక కేంద్రంగా గుర్తించాం. ఇలాంటి కేంద్రాలపై రోజు ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.

నమస్తే : మాస్ కాపీయింగ్ నిరోధానికి చర్యలు ఏమిటీ?

డీఐఈవో : ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి చర్యలు చేపట్టాం. కలెక్టర్, ఇంటర్మీడియట్ అధికారుల సూచనల మేరకు ప్రశాంతంగా నిర్వహిస్తాం.

నమస్తే : పరీక్షల నిర్వహణకు ఎంత మంది అధికారులు ఏర్పాటు చేశారు?

డీఐఈవో : పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, పరీక్షల పర్యవేక్షణ కోసం ముగ్గురు జిల్లాస్థాయి అధికారులు ఉంటారు. ఇందులో డీఐఈవో, సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్‌తో ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ మాస్ కాపీయింగ్ నిరోధానికి చర్యలు తీసుకుంటున్నాం. 23 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 23 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 250 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారు.

నమస్తే : ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?

డీఐఈవో : గతేడాది ప్రథమ సంవత్సరంలో 56 శాతం.. ద్వితీయ సంవత్సరంలో 66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచేందుకు సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయించి విద్యార్థులకు రీవిజన్ తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. 90 రోజుల ప్రణాళికను కేటాయించి, వాటిలో రీవిజన్ తరగతులు, 100 శాతం ఉత్తీర్ణతకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాం. గతేడాది కంటే మెరుగైన ఉత్తీర్ణత సాధిస్తాం.

నమస్తే : ప్రైవేటు యాజమాన్యాల ఫీజుల ఒత్తిడి, హాల్‌టికెట్‌ల అందజేతపై ఎలా చర్యలు తీసుకున్నారు?

డీఐఈవో : ప్రైవేట్ యాజమాన్యాలను ఒత్తిడి లేకుండా విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేయాలని ఆదేశించాం. అలాంటి కళాశాలలపై కచ్చితమైన చర్యలు తీసుకుంటాం. ఇంటర్ విద్యార్థుల హాల్‌టికెట్‌లను ఇంటర్‌నెట్‌లో పెట్టాం. నెట్ సెంటర్ నుంచి హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకుని నేరుగా పరీక్షకు హాజరుకావచ్చు.

నమస్తే : ఎలాంటి నిబంధనలు అమలులో ఉన్నాయి?

డీఐఈవో : పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈసారి నిమిషం నిబంధనపై ఎలాంటి స్పష్టత లేదు. ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. విద్యార్థులు కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో తెరుస్తాం.